
సాక్షి
పల్నాడు
ఆదివారం । 17 । మార్చి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కానూరుకు చెందిన కాకర్ల పూర్ణచంద్రరావు పేరిట కాకర్ల శ్రీదేవి శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు ప్రారంభం

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో అభివృద్ధి చేసిన రెడ్యూస్– రీసైకిల్– రీయూజ్ ప్రాజెక్టును మేయర్ భాగ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
చిలకలూరిపేట	6.27	4.58
గుంటూరు	6.24	4.58
బాపట్ల	6.24	4.56

న్యూస్‌రీల్



పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఎన్నికల నియమావళిని పాటించాల్సిందే

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుందని వివరించారు. జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. శనివారం మధ్యాహ్నం జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించానన్నారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, చేయకూడని పనులపై ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఫొటోలు, విగ్రహాలు కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రచారాలలో రాజకీయ నాయకులు వ్యక్తిగత దూషణలు లేకుండా ప్రచారాలు చేసుకోవాలని కోరారు. మీడియా సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్‌ఓ వినాయకం పాల్గొన్నారు.

మార్కెట్ సెస్ వసూలులో టాప్

దాచేపల్లి: మార్కెట్ సెస్ వసూళ్లలో నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కార్యదర్శి సూరె శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం యార్డు ద్వారా రూ.6.85 కోట్లు టార్గెట్‌గా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే రూ.7 కోట్లకుపైగా మార్కెట్ ఫీజు వసూలు చేశామని వెల్లడించారు. వరసగా రెండో సారి ఫీజు వసూళ్లలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు ఎం.సాంబశివరావు, సీహెచ్ వెంగయ్యను యార్డు చైర్‌పర్సన్ కలకండ ఆంద్రయ్య అభినందించారు.

లోక్‌అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం



నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం కాగా రూ.1.60 కోట్లు కక్షిదారులకు లబ్ధి చేకూరిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి తెలిపారు. 13వ అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. అదాలత్‌లో సివిల్, రాజీ పడదగ్గ క్రిమినల్, చెల్లని చెక్కు, వివాహ సంబంధించిన కేసులు పరిష్కరించారు. అదాలత్‌లో న్యాయమూర్తులు కె.మధుస్వామి, టి.ప్రవల్లిక, సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

32 నామినేషన్లు దాఖలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక నగరంపాలెంలోని గుంటూరు జిల్లా కోర్టులో ది గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే వివిధ పదవుల కోసం పోటీల్లో ఉన్న అభ్యర్థులు తమకే ఓటియాలంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈనెల 28న జరగనున్న ఎన్నికల దృష్ట్యా శుక్రవారం నామినేషన్ల స్వీకరణ చేపట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం కూడా పలువురు నుంచి నామినేషన్లు స్వీకరించగా ఇప్పటివరకు 32 నామినేషన్లు దాఖలయ్యాయి.

గెలుపు గుర్రాలు సిద్ధం

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థులు ఖరారు
- చిలకలూరిపేట నుంచి తొలిసారి కావటికి అవకాశం
- సమరానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు రెడీ



సత్తెనపల్లిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ సీపీకి పల్నాడు కంచుకోట. వెనకబడిన ప్రాంతంగా పేరొందిన పల్నాడును అన్ని విధాల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగులు వేయించారు. తండ్రి బాటలో పయనిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంపై వల్లమలిన ప్రేమ కనబరించారు. లోక్‌సభ పరిధిలో ఎమ్మెల్యేలు అడిగిందే తడవుగా నిధులు కేటాయించారు.

పల్నాడు జిల్లాలో ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను కొనసాగించింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారికి మరోసారి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసే అవకాశం కల్పించింది. వైఎస్సార్ సీపీ జిల్లాఅధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇప్పటికే ఆ స్థానం నుంచి నాలుగుసార్లు పోటీ చేసి గెలుపొందగా, ఇప్పుడు ఐదోసారి పోటీ చేయనున్నారు. నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి రెండు సార్లు వరసగా గెలిచి హ్యాట్రిక్ విజయంకోసం చూస్తున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని పార్టీ అధిష్టానం మరోసారి బరిలో నిలిపింది. సత్తెనపల్లి నుంచి గెలుపొంది మంత్రిగా పనిచేస్తున్న అంబటి రాంబాబు మరోసారి ఫ్యాన్ గుర్తుపై పోటీ చేయనున్నారు.

వినుకొండ అసెంబ్లీ స్థానం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, గురజాల నుంచి కాసు మహేష్‌రెడ్డికి రెండోసారి పోటీ చేసే అవకాశం దక్కించుకున్నారు. అలాగే పెదకూరపాడు అసెంబ్లీ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే నంబూరి శంకరరావు రెండోదఫా బరిలో నిలవనున్నారు. ఇలా ఆరు అసెంబ్లీ స్థానాల్లో సిట్టింగ్‌లకే మరోసారి పోటీ చేసే అవకాశాన్ని వైఎస్సార్ సీపీ కల్పించింది.

చిలకలూరిపేట నుంచి కావటి పోటీ...

చిలకలూరిపేట అసెంబ్లీ స్థానం నుంచి కావటి మనోహర్ నాయుడు పోటీకి అవకాశం కల్పించింది. ఆయన గుంటూరు మేయర్‌గా ఉన్నారు. అసెంబ్లీకి తొలిసారి పోటీ చేస్తున్న కావటి మనోహర్ నాయుడును ఈనెల 12న చిలకలూరిపేట అసెంబ్లీ సమన్వయకర్తగా నియమించిన విషయం తెలిసిందే. చిలకలూరిపేట సిట్టింగ్ ఎమ్మెల్యే విడదల రజినిని పార్టీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థిగా శనివారం ప్రకటించింది.

యుద్ధానికి సిద్ధం...

రానున్న ఎన్నికలలో పోటీ చేసే లోకసభ, అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు తేలడంతో వైఎస్సార్ సీపీ ఎన్నికల యుద్ధానికి సై అంటోంది. ప్రతిపక్షపార్టీల కూటమి ఇంకా అభ్యర్థుల ప్రకటనలో ఇబ్బందిపడుతుంటే ఒకేసారి అభ్యర్థులను ప్రకటించి తన దూకుడును మరోసారి చూపింది. ఇప్పటికే ఇంటింటికి తిరిగి ఐదేళ్ల వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో చేసిన మంచిని వివరించి మరోసారి దీవించమని అడుగుతోంది.

నరసరావుపేట అభ్యర్థి



నియోజకవర్గం: నరసరావుపేట
పేరు: డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
వయస్సు.: 55
విద్యార్హత: ఎంబీబీఎస్, ఎంఎస్
సామాజిక వర్గం: రెడ్డి
ఎన్నికల్లో పోటీ: మూడోసారి

రాజకీయ నేపథ్యం: వైద్యుడిగా ఉంటూ అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మరణం అనంతరం వైఎస్సార్ సీపీలో చేరారు. 2014, 2019లో పోటీ చేసి విజయం సాధించారు. మూడో సారి ఎన్నికల బరిలో ఉన్నారు.

చిలకలూరిపేట అభ్యర్థి



నియోజకవర్గం: చిలకలూరిపేట
పేరు: కావటి శివనాగ మనోహర్‌నాయుడు
విద్యార్హత: బీకాం
వయసు: 47
ప్రస్తుత హోదా: గుంటూరు నగర మేయర్
సామాజిక వర్గం: కాపు
ఎన్నికల్లో పోటీ: తొలిసారి

రాజకీయ నేపథ్యం: ఎన్ఎస్‌యూఐ గుంటూరు నగర విద్యార్థి విభాగం కార్యదర్శిగా కార్పొరేటర్‌గా. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి, మూడున్నర సంవత్సరాల పాటు వైఎస్సార్ సీపీ పెదకూరపాడు సమన్వయకర్తగా పనిచేశారు. సుధీర్ ఫౌండేషన్ ద్వారా వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, విద్యార్థులకు ఆర్థిక సహాయం, స్పోర్ట్స్ కిట్ల బహూకరణ వంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

వినుకొండ అభ్యర్థి



నియోజకవర్గం: వినుకొండ
పేరు: బొల్లా బ్రహ్మనాయుడు
వయస్సు : 64
వృత్తి : వ్యాపారం
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే
సామాజిక వర్గం: కమ్మ
ఎన్నికల్లో పోటీ: నాలుగో సారి

రాజకీయ నేపథ్యం: 2009లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరి తమ రాజకీయ రంగప్రవేశం చేశారు. 2014లో వైఎస్సార్ సీపీలో చేరి జగన్ ఆదేశాల మేరకు పెదకూరపాడు నియోజకవర్గంలో పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. 2019లో వినుకొండలో పోటీ చేసి టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులుపై వినుకొండ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఎవరూ సాధించని 28,628 ఓట్ల రికార్డు మెజార్టీతో గెలిచారు.

మాచర్ల అభ్యర్థి



నియోజకవర్గం: మాచర్ల
పేరు: పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వయస్సు : 54
విద్యార్హత: బీకాం, ప్రస్తుత హోదా: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే
సామాజిక వర్గం: రెడ్డి, ఎన్నికల్లో పోటీ: ఐదో సారి

రాజకీయ నేపథ్యం: ఇద్దరు బాబాయిల నుంచి రాజకీయ వారసత్వం పొందారు. 2006లో జెడ్పీటీసీ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2009లో కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. వైఎస్సార్ తరఫున మూడు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా ఉన్నారు. పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఉండి పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారు. ఐదోసారి పోటీ చేస్తూ రికార్డు సృష్టించనున్నారు.

పెదకూరపాడు అభ్యర్థి



నియోజకవర్గం: పెదకూరపాడు
పేరు: నంబూరు శంకరరావు
వయస్సు : 56 విద్యార్హత: ఇంటర్మీడియెట్
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే , సామాజిక వర్గం: కమ్మ
ఎన్నికల్లో పోటీ: రెండో సారి

రాజకీయ నేపథ్యం: మొదటి సారిగా 2019 పెదకూరపాడు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ అభ్యర్థికొమ్మాలపాటి శ్రీధర్‌పై విజయం సాధించారు. శంకరరావు తండ్రి పరమి వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా, కాంగ్రెస్‌పార్టీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేశారు. తుళ్లూరు మండలంలో రాజకీయంగా గుర్తింపు పొందిన కుటుంబం.

గురజాల అభ్యర్థి



నియోజకవర్గం: గురజాల
పేరు: కాసు మహేష్‌రెడ్డి
వయస్సు : 49
విద్యార్హత: ఎల్‌ఎల్‌బీ
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే
సామాజిక వర్గం: రెడ్డి
ఎన్నికల్లో పోటీ: రెండోసారి

రాజకీయ నేపథ్యం: తండ్రి కాసు వెంకటకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఆయన వెంట ఉండి కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. 2017లో వైఎస్సార్ సీపీలో చేరారు. 219 ఎన్నికలలో గురజాల నుంచి గెలుపొందారు.

సత్తెనపల్లి అభ్యర్థి



నియోజకవర్గం: సత్తెనపల్లి
పేరు: అంబటి రాంబాబు
వయస్సు : 68 విద్యార్హత: బీఎల్, న్యాయవాది
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే, సామాజిక వర్గం: కాపు
ఎన్నికల్లో పోటీ: ఆరోసారి

రాజకీయ నేపథ్యం: 1989లో రేపల్లె నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994, 1999లో ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2014లో సత్తెనపల్లి నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2019లో అదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

పల్నాడు ఎంపీ అభ్యర్థి



నియోజకవర్గం: పల్నాడు లోక్‌సభ
పేరు: పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్
వయస్సు : 49, విద్యార్హత: బీడీఎస్
ప్రస్తుత హోదా: నెల్లూరు ఎమ్మెల్యే, సామాజిక వర్గం: యాదవ
ఎన్నికల్లో పోటీ: లోక్‌సభకు తొలిసారి

రాజకీయ నేపథ్యం: నెల్లూరులో కాంగ్రెస్‌పార్టీ నుంచి రాజకీయాలు ప్రారంభించారు. తొలుత కార్పొరేటర్‌గా గెలుపొందారు. 2014, 2019లో రెండు వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. గతంలో ఒకరి ఎమ్మెల్యే ఓడిపోయారు. యువతలో ప్రత్యేక ఆకర్షణ నాయకుడిగా ఎదిగారు.

టీడీపీ మూకల దాడి

వైఎస్సార్ సీపీ నాయకుడి కారు అద్దాలు ధ్వంసం



ధ్వంసం అయిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి కారు అద్దాలు

కారెంపూడి: పల్నాడు జిల్లా కారెంపూడి మాజీ ఎంపీపీ మేకల శారద భర్త మండల వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మేకల శ్రీనివాసరెడ్డి కారు అద్దాలను శనివారం రాత్రి టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. తన కారును బస్టాండ్ సెంటర్‌లో ఆపి శ్రీనివాసరెడ్డి టీ తాగుతుండగా గుంపుగా వచ్చిన సుమారు 60 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాసరెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బస్టాండ్ సెంటర్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపు చేశారు. ఇదిలా ఉంటే అంతకు ముందు ఒప్పిచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీకాంత్ తన అనుచరులతో కలసి వాసవి అపార్టమెంట్ వద్ద టీ స్టాల్‌కు వెళ్లిన సమయంలో అక్కడే అతడిపై టీడీపీ వర్గీయులు దాడికి సమాయత్తం కావడంతో అది గమనించిన శ్రీకాంత్ అక్కడ నుంచి తప్పుకుని బస్టాండ్‌కు చేరుకున్నాడు. అతడి వెనుకే టీడీపీ నాయకులు ఫాలో అయ్యారు. ఇక బస్టాండ్‌లో కూడా ఉండకుండా కారులో వెళ్లిపోయాడు. తనపై దాడి చేసేందుకు టీడీపీ నాయకులు వెంబడించారని శ్రీకాంత్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే బస్టాండ్‌కు చేరుకున్న టీడీపీ వర్గీయులు అక్కడే నిలిపి ఉన్న మాజీ ఎంపీపీ భర్త శ్రీనివాసరెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. తర్వాత సమాచారం అందుకున్న కారెంపూడి సీఐ, ఎస్ఐ రంగ ప్రవేశం చేశారు. పరిస్థితిని అదుపు చేస్తున్నారు. మళ్లీ ఎలాంటి పరస్పర దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

బీసీలకు వైఎస్సార్ సీపీ అగ్రతాంబూలం

- 2024 ఎన్నికలకు జగనన్న జట్టు సిద్ధం
- ఎంపీ స్థానం బీసీలకు కేటాయింపు
- లోక్‌సభ చరిత్రలో తొలిసారి
- మాజీ మంత్రి పి.అనిల్ కుమార్ యాదవ్‌కు అవకాశం

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల సమరం మొదలైంది. వైఎస్సార్ సీపీ సిద్ధమైంది.

ఎన్నికల కమిషన్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అందులో భాగంగా నరసరావుపేట లోకసభ స్థానాన్ని తొలిసారిగా బీసీలకు కేటాయించింది. ఇక్కడ నుంచి ఎప్పుడు అగ్రవర్ణాలకు చెందిన వారే గెలుపొంది పార్లమెంట్ మెట్లెక్కుతున్నారు. సుమారు 40 వరకు బీసీ ఉపకులాలు ఉన్నా ఏ పార్టీ అవకాశం ఇవ్వలేదు. 1952 నుంచి 2019 వరకు 15 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పటికీ ఏ రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించి పోటీ చేయించి గెలిపించిన దాఖలాలు లేవు. సంక్షేమ రథసారథి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు లోక్‌సభ స్థానాన్ని కేటాయించి ఘనత సాధించారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి యాదవ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి పి.అనిల్ కుమార్ యాదవ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన పార్లమెంట్ సమన్వయకర్తగా ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఈదఫా బీసీలకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించడంతో ప్రస్తుత ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

మంత్రిగా పనిచేసిన అనుభవం...

లోక్‌సభ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ నెల్లూరు టౌన్ అసెంబ్లీ స్థానం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి వరుసగా విజయం సాధించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తొలి కేబినెట్‌లో జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. చెన్నైలోని ఓ ప్రముఖ కళాశాలలో బీడీఎస్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నెల్లూరు కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అనిల్‌యాదవ్ కేవలం 90 ఓట్లతో ఓటమి చెందారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

మంత్రి అంబటి రాంబాబు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్థానిక ఆర్యవైశ్య నాయకులతో కలసి పూలమాలలు వేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడిగా, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా చరిత్రలో చిరస్థాయిగా పొట్టి శ్రీరాములు నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఆర్యవైశ్య సంఘం నాయకులు శింగరి మధుసూదన్‌రావు, దేవతి సుబ్బారావు, కట్టమూరి అప్పారావు, కొత్త రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రధాని సభకు భారీ బందోబస్తు

- ఐజీ పాలరాజు, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- పలు మార్గాల్లో వాహనాలు దారి మళ్లింపు

నరసరావుపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరు కానున్న ప్రజాగళం సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక సందర్భంగా శనివారం వీవీఐపీ కాన్వాయ్ ట్రయిల్ రన్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బందోబస్తులో ఆరుగురు ఎస్పీలతో పాటు 3900 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

వాహనాల దారి మళ్లింపు ఇలా..

- చెన్నై నుంచి కొల్‌కత్తా హైవే 16 పై గుంటూరు–విజయవాడ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలను ఒంగోలు –దిగమర్రు 214–ఏ పైకి దారి మళ్లించి ఒంగోలు, త్రోవగుంట, చీరాల, పెనుమూడి, రేపల్లె, గుడివాడ, పామర్రు, చల్లపల్లి, మచిలీపట్నం, విశాఖపట్నం మీదుగా కొల్‌కత్తాకు మళ్లించారు.
- చెన్నై నుంచి ఒంగోలు మీదుగా నార్కెట్‌పల్లి ఎన్‌హెచ్ 36పై హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలను ఒంగోలు, మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్‌కు దారి మళ్లించారు.
- కొల్‌కత్తా నుంచి చెన్నై ఎన్‌హెచ్16పై చెన్నై వెళ్లే భారీ వాహనాలను విశాఖపట్నం, హనుమాన్ జంక్షన్ మీదుగా దిగమర్రు – ఒంగోలు ఎన్‌హెచ్ 214– పై మచిలీపట్నం, గుడివాడ, పామర్రు, చల్లపల్లి, రేపల్లె, చీరాల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లించారు.
- హైదరాబాద్ నుంచి విజయవాడ ఎన్‌హెచ్–9 పై కలకత్తా వెళ్లే భారీ వాహనాలను ఇబ్రహీంపట్నం, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్, విశాఖపట్నం మీదుగా కొల్‌కత్తాకు మళ్లించారు.
- హైదరాబాద్ నుంచి విజయవాడ ఎన్‌హెచ్–9పై చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, దాచేపల్లి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లించారు.
- ఒంగోలు వైపు నుంచి గుంటూరు, విజయవాడ వైపు ఎన్‌హెచ్ 16 పై వెళ్లే వాహనాలను త్రోవగుంట, చీరాల, బాపట్ల, పొన్నూరు మీదుగా గుంటూరుకు దారి మళ్లించారు.
- ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే వాహనాలను త్రోవగుంట, చీరాల, పర్చూరు మీదుగా దారి మళ్లించాలన్నారు.
- ఒంగోలు వైపు నుంచి గుంటూరు, విజయవాడ వైపు ఎన్‌హెచ్–16పై వెళ్లే వాహనాలను ఒంగోలు, మేదరమెట్ల, అద్దంకి, సంతమాగులూరు, నరసరావుపేట బైపాస్ రోడ్ ఫిరంగిపురం, పేరిచెర్ల మీదుగా గుంటూరు, విజయవాడ వెళ్లాల్సి ఉంది.
- గుంటూరు నుంచి ఒంగోలు, చెన్నై వైపు వెళ్లే వాహనాలను బుడంపాడు అడ్డరోడ్డు నుంచి పొన్నూరు, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా దారి మళ్లించారు.
- గుంటూరు, పేరేచర్ల, ఫిరంగిపురం, నరసరావుపేట బైపాస్ రోడ్ మీదుగా సంతమాగులూరు, అద్దంకి, మేదరమెట్ల, ఒంగోలు మీదుగా కూడా చెన్నై వెళ్లవచ్చు.
- 16 వ నంబర్ జాతీయ రహదారిపై చిలకలూరిపేట నుంచి మేదరమెట్ల హైవే వరకు ఎటువంటి వాహనాలను అనుమతించరాదని, కేవలం ప్రజాగళం సభ ప్రాంగణానికి వచ్చు వాహనాలను మాత్రమే అనుమతించాలని అధికారులు నిర్ణయించారు.

లోక్ అదాలత్‌లో 113 కేసులు పరిష్కారం

కె.ఎస్.రామకృష్ణారావు

బాపట్లటౌన్: బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 113 కేసులు పరిష్కరించినట్లు లోక్ అదాలత్ చైర్మన్, గుంటూరు పోక్సోకోర్టు జడ్జి కె.ఎస్. రామకృష్ణారావు తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంతోపాటు రూ.56,76,969 సంబంధించిన లావాదేవీలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేంద్ర, బార్ అసోసియేషన్ సెక్రటరి ఎల్.సాంబయ్య పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు ఖ్యాతి తెచ్చిన పొట్టి శ్రీరాములు

నివాళులు అర్పించిన పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనీల్, ఎమ్మెల్యే గోపిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, చిత్రంలో డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్, ఆర్యవైశ్య నాయకులు

నరసరావుపేట: తెలుగు ప్రజలకు గౌరవం, ఖ్యాతి తీసుకొచ్చిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ మంత్రి డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 125 జయంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని శివుని ఐలాండ్ వద్దనున్న అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పొట్టి శ్రీరాములు సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ అనీల్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో వ్యాపారులు ప్రశాంతంగా తమ వృత్తిని నిర్వహించుకునేందుకు కావాల్సిన పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వ్యాపారులు తనకు మద్దతు పలకాలని కోరారు. పార్లమెంటు సభ్యునిగా వ్యాపారులకు తగిన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర బాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 55 రోజులపాటు ఆమరణదీక్ష చేసి వీరమరణం పొందారన్నారు. దీనిపై స్పందించిన ఆనాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేకరాష్ట్రం ప్రకటించారన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు, పొట్టి శ్రీరాములు సేవా సమితి అధ్యక్షులు మిరియాల శ్రీహరిరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, నాయకులు ఊర బాస్కరరావు, వి.సాంబశివరావు, దివ్వెల రామకృష్ణ, మద్ది రామబ్రహ్మనందరావు, దేవిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అమరజీవి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించిన ఎస్పీ



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ఆత్మార్పణ చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కొనియాడారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలు చల్లి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల అవశ్యతను చాటిచెప్పిన భవదీయుడు శ్రీరాములు అన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషిచేశారన్నారు. పొట్టి శ్రీరాములు వంటి వారు పదిమంది ఉంటే ఒక్క ఏడాదిలోనే స్వతంత్రం సాధించవచ్చునని గాంధీజీ అన్నమాటలు ఆయన అకుంఠిత దీక్ష, పట్టుదలను గుర్తు చేశాయన్నారు. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగానికి పూనుకున్న ఆయన త్యాగం వెలకట్టలేనిది అన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తుల, కార్యసాధకుల అడుగు జాడల్లో నడుస్తూ, వారి ఆశయాల సాధనకు కృషిచేయాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

చిన్నారి రేవంత్‌ను ఆదుకున్న సీఎం సహాయ నిధి



బాధితురాలికి సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: నిరుపేద కుటుంబంలో జన్మించిన మన్నవ రేవంత్ పదేళ్లకే టైప్-2 డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నాడు....ఈ వ్యాధికి ప్రతి రోజు మందులు వాడుకోవాలి లేకపోతే వ్యాధి తీవ్రమవుతుంది. మందులు కొనేందుకు అ తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేదు. దిక్కుతోచని స్థితిలో ముఖ్యమంత్రి సహాయ నిధి అ పిల్లవాడి జీవితంలో వెలుగులు నింపింది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వైద్యఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఇంటికే వచ్చాయి. ఇలా అనేక మంది జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయనిధి వ్యాధిగ్రస్తులకు వెలుగునిస్తుంది. మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన రేవంత్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞాతలు తెలుపుతున్నారు.శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో రేవంత్‌తో పాటు పాటిబండ్ల గ్రామానికి చెందిన కోమ్మారెడ్డి శౌరెడ్డి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల 60 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇవే కాకుండ నియోజకవర్గంలోని 36 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే శంకరరావు అందించారు. పేద రోగుల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి అన్ని శంకరరావు అన్నారు. భాధిత కుటుంబాలు సీఎంజగన్‌కు, ఎమ్మెల్యే శంకరరావు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల కళాశాలలో అండర్-20 రెజ్లింగ్ ఎంపికలు



రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అండర్-20 స్త్రీ,పురుషుల రెజ్లింగ్(కుస్తీ) ఎంపికలు జరిగాయి. ఫ్రీస్టయిల్ పురుషుల విభాగంలో టి.రోహిత్, ఆర్ శ్రీహరి, టి.శ్రీహరి, కె.ప్రభాకర్‌లు ఎంపికైనారు. పుషుల గ్రీకోరోమన్ విభాగంలో కె.రాహుల్, బి.తేజ, ఎస్.బాలకోటేశ్వరరావు, ఎస్ తేజోకుమార్, జిఇస్సాకు, ఎ.విజయకుమార్, పి.నవీన్‌లో ఎంపికై నారు. ఎంపికయిన క్రీడాకారులంతా ఈనెల 20న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొననున్నట్లు గుడిపూడి భూషణం తెలిపారు.

నేతి వెంకన్న స్వామికి భక్తుల నీరాజనాలు



పూజలు చేసేందుకు వచ్చిన మంత్రి అంబటి

రాజుపాలెం: దేవరంపాడు కొండపై ఉన్న నేతి వెంకన్న స్వామిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. తొలుత మంత్రి కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి రాష్ట్ర మంత్రి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నేతి వెంకన్న స్వామి ఆలయాన్ని భక్తి శ్రద్ధలతో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, దేవరంపాడు సర్పంచి పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు ఉన్నారు.

మద్యం మత్తులో అగ్నిమాపక శాఖాధికారి హల్‌చల్



పోలీసులతో వాదులాడుతున్న శ్రీనివాసరెడ్డి

పట్నంబజారు: మద్యం మత్తులో ఆటోను ఢీకొట్టిన అగ్నిమాపక శాఖ అధికారిపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా పనిచేస్తున్న వాకా శ్రీనివాసరెడ్డి శనివారం సాయంత్రం స్తంభాలగురు వైపు నుంచి కారులో వస్తున్నారు. ఈ క్రమంలో యేలే ఆంజనేయులు అనే వ్యక్తి ఆటోను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో.. వారిని సదరు అధికారి ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. స్టేషన్‌కు వచ్చిన తర్వాత కూడా హల్‌చల్ చేశారు. శ్వాస పరీక్ష నిర్వహించే సమయంలో సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్ష మీరే చేయించుకోండి అంటూ.. ఇష్టానుసారంగా వ్యవహరించారు. కారు దిగకుండా ట్రాఫిక్ పోలీసులను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలుస్తోంది. మద్యం సేవించినట్లు పరీక్షలో గుర్తించామని, కేసు నమోదు చేసి, కారును సీజ్ చేసినట్లు వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలలో రేపల్లె వాసులకు చోటు

రేపల్లె రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించిన కమిటీలలో రేపల్లె నియోజవకర్గంకు చెందిన పలువురికి స్థానం లభించింది. బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం కమిటీలో రేపల్లెకు చెందిన పలువురికి పదవులు దక్కాయి. బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం వైస్‌ప్రెసిడెంట్‌గా షేక్ అలీబుడా, జనరల్ సెక్రటరీగా షేక్ అన్వర్, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ మైమూద్, కార్యదర్శులుగా షేక్ మునీర్, షరీఫ్‌బేగ్‌లు నియమితులయ్యారు.

జిల్లా యువజనవిభాగం

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా యువజన విభాగంలో రేపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపికయ్యారు. వైస్‌ప్రెసిడెంట్‌గా నల్లగుర్ల దేవీప్రసాద్, జనరల్‌సెక్రటరీగా కొలగాని శ్రీనివాసరావు, సెక్రటరీలుగా దొంతిబోయిన ఏడుకొండలు రెడ్డి, కొక్కిలిగడ్డ ప్రశాంత్, జాయింట్ సెక్రటరీలుగా శీలం పూర్ణచంద్రశేఖరరెడ్డి, తూనుగుంట్ల సుమన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డి.నాగమల్లేశ్వరరావు, పూర్ణ శివనాగ దుర్గావెంకటేశ్వరరావులు నియమితులయ్యారు.

యువజన విభాగం మండలాల అధ్యక్షులు నియామకం

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రేపల్లె పట్టణ అధ్యక్షుడుగా ఆలా రాజ్‌పాల్, రేపల్లె మండల అధ్యక్షుడుగా యంద్రపాటి సుధీర్, నిజాంపట్నం మండల అధ్యక్షుడుగా మోపిదేవి సాయికిరణ్‌లు ఎన్నికయ్యారు.